

# పనిష్మెంట్

తిరుమలశ్రీ

**"మహాప్రభో! ఈ శిక్ష నేను భరించలేను. నిత్యం ఆ నరకాన్ని చూళ్లేకపోతున్నాను. ఇన్నాళ్లూ అనుభవించిన శిక్ష చాలు, నన్నొకేసారి ఉరేసేయండి సారూ!"**

అతని పలుకులతో కోర్టు హాలంతా నిశ్శబ్దంగా అయిపోయింది. న్యాయమూర్తి, న్యాయవాదులు, పోలీసులు, ముద్దాయిలూ, ప్రేక్షకులూ...అక్కడ అంతమందీ ఉన్నా - ఎవరూ లేనట్టు...కోర్టంతా ఖాళీఅయినట్టూ, హఠాత్తుగా నిశ్శబ్దం ఆవరించుకుందక్కడ.

ఆ మొత్తుకోలు చేసుకున్న వ్యక్తివంక సూటిగా చూశారు మాజిస్ట్రేట్ మార్కండేయ. అతన్ని గుర్తుపట్టడం కష్టం కాలేదు ఆయనకు. నరసింహులు. నలభై ఏళ్లుంటాయి. మనిషి నల్లగా, ఎత్తుగా, దృఢంగా ఉన్నాడు.

అతని పలుకుల సారాంశం మనసుకు హత్తడంతో అతని వదనంలోకి తీక్షణంగా చూశారు మాజిస్ట్రేట్. అతన్ని చూస్తుంటే నెల క్రితం అతను తన వద్దకు తీసుకువచ్చిన దృశ్యమూ, పరిస్థితులూ ఆయన మనోపథంలో మెదిలాయి.

* * *

బాలభానుడు బద్ధకంగా ఒళ్లువిరుచుకుంటున్న వేళ ...

గిరిజనవాడలో ఉదయపు సందడి ఆరంభమయింది.

ఎరుకలి ఎర్రోడు పందుల్ని అదలిస్తున్న అరుపులూ, పందులు మందలుగా పరుగులు పెడుతున్న చప్పుళ్లూ, అవి చేస్తున్న శబ్దాలూ ... వాటిని తరిమే కుక్కల మొరుగుళ్లూ ...

అప్పుడే మేల్కొన్న కోడిపుంజాల కూతలూ ... గుడ్లుపెట్టడానికి కోడిపెట్టలు పెడుతున్న పురు

## ముద్దుల కొడుకు

"పెద్దయ్యాక వీడు ఖచ్చితంగా పెద్ద ఇంజనీరు అవుతాడు!" పేక ముక్కలతో ఇల్లు కడుతున్న ముద్దుల కొడుకుని మురిపెంగా చూస్తూ అన్నాడు తండ్రి.

"ఇంజనీర్ మాటేమో కానీ, పెద్ద కాంట్రాక్టరయ్యే సూచనలు కనిపిస్తున్నాయి!" జర్నలిస్టు అయిన పిల్లాడి మేనమామ తన సహజ ధోరణిలో అన్నాడు.

- ఎస్. హన్మంత్రావ్ (విశాఖపట్నం)

టి నొప్పులూ ...

పిల్లగాళ్ల ఏడ్పులూ ... గొడవలూ ... పెద్దోళ్ల తిట్లూ ... రంకెలూ ...

ఇరుగుపొరుగుల పరస్పర పలకరింపులూ ...

వాడలోని హడావుడికి నాంది పలికిన సూర్యుడి నులివెచ్చని కిరణాలు వీపుమీద గిలిగింతలు పెడుతుంటే, లంబాడీరాముడు రిక్షా తుడవడం అయిందనిపించాడు. పాతికేళ్లుంటాయి వాడికి. నల్లగా, పొట్టిగా, తుమ్మ మొద్దులా ఉంటాడు. తైలసంస్కారం ఎరుగని రాగిపీచు తల. తొడలు పూర్తిగా దిగని ఖాకీనిక్కరు, భుజంమీద ఓ పాతతుండూ తప్పిస్తే ఒంటిమీద మరో వస్త్రం లేదు.

"ఇదిగో మావా, చాయ్!" అంటూ గుడిసె లోంచి బయటకొచ్చింది రాముడి పెళ్లాం రత్తాలు.

శిథిలావస్థలో ఉన్న ఆ అద్దె గుడిసె ఇద్దరు మనుషులు తల దాచుకునేందుకు కనాకష్టంగా సరిపోతుంది. ఆ వాడలో ఉండేవన్నీ అలాంటి గుడిసెలే అయినా, వాటిలో నివసించే వారిలో సొంతదారులు అతికొద్దిమందే! మిగతావన్నీ డబ్బున్న మోతుబరులవే. గిరిజనుల పునరావాసం పేరిట ప్రభుత్వపు స్థలాలను ఆక్రమించుకుని గుడిసెలు వేసిన 'ప్రముఖులు' కొందరు వాటిని ఆ బడుగు వర్గపు ప్రతినిధులకు అద్దెకివ్వడం రివాజు. పందుల ఆవాసాలకంటే అధ్వాన్నంగా ఉన్నా, నిలువనీడ దొరికిందన్న ఆనందంతో వాటినే భవంతు లుగా భావించుకుని వాటిలో తలదాచుకుంటున్నారు వాళ్లు.

రత్తాలు అందించిన మట్టికప్పును అందుకున్నాడు రాముడు. పేరుకి చాయ్అయినా, అందులో పాలు మాత్రం సున్నా. పలుచటి టీ డికాక్షన్ అది. ఆ వేడినీళ్లను ఆత్రంగా తాగాడు వాడు.

'ఇయ్యాలైనా నాలుగు పైస లు పట్రా, మావా! బుడ్డోళ్లకు బువ్వెట్టి నాల్రోజులయింది. ఆకలో అంటూ ఏడుత్తోంటే ఈరిగాడి పెళ్లాన్ని బతిమాలి కాసిని గెంజి చుక్కలు తెచ్చి పోసినా నిన్న. ఇక ఆళ్లను ఆపడం నా తరం కాదు. కడుపులోపాప ఆకలితో మెలితిరిగిపోతావుంటే నాకూ కళ్లు తిరగతావున్నాయి!'అంది రత్తాలు మెల్లగా.

జాలిగా, అసహాయంగా ఆలి ముఖంలోకి చూశాడు రాముడు. నెలలు నిండుతున్న రత్తాలు పాలిపోయి, అతినీరసంగా కనిపిస్తోంది. పసిపిల్లలిద్దరూ గుడిసెలో ఇంకా నిద్రపోతూనే ఉన్న కారణంగా వారి అలికిడి లేదు. లేకుంటే, 'బాబా! ఆకలే!' అం టూ చెరో పక్కా వాటేసుకునేవాళ్లే.

పొద్దుట్నుంచి రాత్రివరకు పేగులు తెంచుకుని రిక్షా తొక్కినా రూపాయి డబ్బులు కూడా మిగలడంలేదు రాముడికి. వచ్చింది రిక్షాకి అద్దెకట్టడానికే చాలకుండా ఉంది. అద్దెడబ్బుల్లో తక్కువైతే షావుకారు తిట్టే పచ్చిబూతులకు అంతుండదు ... వారం రోజులుగా రోజంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా పైసలు మిగలడంలేదు. ఫలితంగా పస్తులు తప్పడంలేదు. రత్తాల్నిచూస్తే, ఇంటిపరిస్థితిని తలుచుకుంటే దుఃఖం ఉబికివచ్చింది వాడికి. మౌనంగా చూపుల తోనే పెళ్లాన్ని ఓదార్చి రిక్షా తీసుకుని బయలు దేరాడు.

"ఈలుంటే మద్దెలో ఓ పాలొచ్చి పైసలిచ్చిపో, మావా! ఈపూటైనా పిల్లలకు గంజికాసి పోస్తాను!" అంది రత్తాలు - వాడు వెళుతుంటే. అలా అంటూంటే ఆమె కన్నుల్లో నీరు గిర్రున తిరిగింది. మౌనంగా తలూపాడు రాముడు.

కన్నీటిని కొనగోట తుడుచుకుంటూ, 'బగమంతుడా! ఇయ్యాలైనా నాలుగుపైసలు దొరికేటట్టు చూడు. లేకపోతే బుడతల పేణాలు పోయేటట్టున్నాయి' అని మొక్కుకుంది మదిలో.

బేరాలు దొరకాలని మనసులోనే ఇష్టదైవాన్ని వేడుకుంటూ, లేని ఓపిక తెచ్చుకుని చెదిరిపోయిన ఆశను పోగుచేసుకుంటూ రిక్షా తొక్కుతున్నాడు రాములు.

* * *

బస్సెక్కాడంటే ఒళ్లు తెలీదు నరసింహులికి. సిటీబస్ డ్రయివర్ అతను. పదిహేనేళ్లుగా ఆ ఉద్యోగం చేస్తున్నాడు. వీల్ పుచ్చుకుంటే అతని చేతిలో సుదర్శనచక్రంలా తిరగాల్సిందే అది. యాక్సిలరేటర్ అతని కాలికింద అప్పడమయి పోవాల్సిందే. బస్సుస్టార్ట్ చేశాడంటే ఆగమేఘాల మీద ఆగకుండా పరుగెత్తాల్సిందే. తన బస్సుముందు విమానం కూడా పనిచేయదంటూ ప్రగల్భాలు పలుకుతూంటాడు. అనుభవం, హద్దులు మీరిన ఆత్మవిశ్వాసం రంగరించగా ఏర్పడ్డ నిర్లక్ష్యం, అహంకారం నరసింహులుకి సొత్తులయ్యాయి. తాను బండి నడుపుతుంటే తన మార్గంలో ఏ వెహికలూ అడ్డు రాకూడదనుకుంటాడు. మరే వాహనమైనా తనను ఓవర్‌టేక్ చేసుకుపోతే అది తనకు చిన్నతనంగా భావిస్తాడు. వేగం తగ్గించకుండా ముందున్న వాహనాలను అతి చాకచక్యంగా తప్పించుకుని, రణరంగంలోలా ఆ జనారణ్యంలో ముందుకు దూసుకుపోవడం అలవాటయిపోయిందతనికి. అందులోవున్న రిస్క్ అతని ఊహకే అందనిది. అందినా అతను లక్ష్యం చేయనిది.

పీక్ అవర్సేమో, వరదగోదారిలా నిండుగా జనంతో కిటకిటలాడుతోంది సిటీబస్. బిజీగా ఉన్న రోడ్డుమీద వేగంగా డ్రయివ్ చేస్తున్నాడు నరసింహులు. కాలసలు యాక్సిలేటర్‌మీద నుంచే తీయని కారణంగా అన్ని హద్దులనూ అతిక్రమించి అమితవేగంగా దూసుకుపోతోంది బస్సు. ఇక్కడికీ కండక్టర్ మధ్య మధ్య హెచ్చరిస్తూనే ఉన్నాడు - "స్పీడు తగ్గించు, గురూ! యాక్సిడెంటై పోగల్దు!" అంటూ.

"నీ యవ్వ! మరీ డర్పోక్‌లా ఉన్నావేమిటోయ్ నువ్వు? పదిహేనేళ్లనుంచి ఇదే స్పీడుతో తోల్తన్నాను బండి. నాకు చెప్పమోక!" అంటూ గఁయ్‌మన్నాడు నరసింహులు అతనిమీద. అతని పోకడ చూసి ప్రయాణీకులు ప్రాణాలు గుప్పిట్లోపెట్టుకున్నారు. చౌరస్తా జంక్షన్ అది. ట్రాఫిక్ లైటు ఉందక్కడ. ఓ సెకను అది తనవైపు కళ్లెర్రజేసి చూడబోతున్నట్టు ఊహించాడు నరసింహులు. రెడ్‌లైట్ ఫ్లాష్ అయ్యేలోపున జంక్షన్ దాటేయాలనుకున్నాడు. యాక్సిలరేటర్‌ని బలంగాతొక్కి స్పీడుపెంచడమే కాక, అదే స్పీడులో ముందున్న వాహనాలను ఓవర్‌టేక్ చేయబోయాడు. ఆ ప్రాసెస్‌లో ఎదురుగా వస్తున్న కారుని డాష్ చేయబోయి, దాన్ని నివారించేందుకని కంగారుగా వీల్‌ని పక్కకు స్టీర్ చేశాడు.

* * *

అంతవరకూ రెండుబేరాలు దొరకడంతో అయిదారురూపాయలు వచ్చాయి రాముడికి. వాటిని చూడడంతో రత్తాలు వేడుకోలు జ్ఞాపకమొచ్చింది. అంతలోనే కర్కోటకుడైన షావుకారు కళ్లెర్రజేస్తూ మదిలో మెదిలాడు. రాత్రయ్యేసరికి

రిక్షాబాడుగ కూడబెట్టి ముడుపు చెల్లించకపోతే జర గబోయే భాగోతమూ గుర్తుకొచ్చింది. అయినా పసి వాళ్ల ఆకలివదనాలే జయించాయి అతణ్ని. ఏమ యితే అయిందని అంతవరకూ సంపాదించిన పైసల్ని రత్తాలి చేతిలో పోసేందుకే నిశ్చయించు కున్నాడు. త్వరత్వరగా రిక్షా తొక్కుకుంటూ ఇంటి దారి పట్టాడు.

అదిగో...అప్పుడే...వచ్చి పడిందా బస్సు... సిటీ బస్సు ... పెనుభూతంలా రెప్పపాటులో మీద కు దూసుకొచ్చింది.

జరుగుతున్నదేమిటో గ్రహించేలోపునే వెనుక నుంచి వేగంగా వచ్చి రిక్షాను గుద్దింది.

ఫలితంగా రిక్షాతోపాటు తాను రోడ్డుమీదకు పడిపోయాడు రాముడు. బస్సు వాడిమీంచి వెళ్లి పోయింది.

హాహాకారాలతో ట్రాఫిక్ స్తంభించిపోయింది.

* * *

ఆ కేసు వివరాలను ఆలకించిన మాజిస్ట్రేట్ మార్కండేయులు లోలోపలే ఎంతో బాధపడ్డారు. ఒక వ్యక్తి అహంకారం, నిర్లక్ష్యం కారణంగా ఓ పేదకుటుంబం నాశనమయిపోయినందుకు వ్యథ చెందారాయన. నరసింహులి నిర్లక్ష్యానికీ, రాష్ డ్రైవింగ్‌కీ రాముడు బలయిపోయాడు. అతని కుటుంబం వీథుల పాలయింది. ఆ తీవ్రనష్టానికి, శాశ్వతనష్టానికి ఎవరు బాధ్యులు? ట్రాఫిక్‌రూల్స్‌ని పాటించని ప్రజలా? వాటిని పాటించేటట్టు చేసే బాధ్యతలో ఫెయిలయిన ప్రభుత్వమా? లంచగొం డి వ్యవస్థా? ... ఎవరు? ఎవరు బాధ్యులు ...? ఆ నష్టాన్ని పూరించేదెవరు? ఆ కుటుంబపు కష్టాన్ని తీర్చేదెవరు?? నరసింహం మీద పట్టరాని ఆగ్రహం కలిగింది మార్కండేయులికి. కానీ మాజిస్ట్రేట్‌గా ఆ ఆగ్రహానికి ఉనికిని కల్పించలేకపోయారాయన.

నరసింహులి మీద 'కల్పబుల్ హోమిసైడ్ నాట్ ఎమౌంటింగ్ టు మర్డర్'కి సెక్షన్ 304-ఎ ఐ.పి.సి. కింద కేసుపెట్టారు పోలీసులు. చార్జిషీటు ఫైలు చేశారు.

ముద్దాయికి బెయిలిస్తూ మాజిస్ట్రేట్ పెట్టిన కండిషన్‌కి అటు ముద్దాయి తరపు లాయరు, ఇటు అసిస్టెంట్ పబ్లిక్‌ప్రాసిక్యూటరూ కూడా విస్తు పోయారు.

"కేసు ట్రయల్‌కి వచ్చేంతవరకు ఈ ముద్దా యి నరసింహులు ప్రతిరోజూ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌కి వెళ్లి అక్కడి కాజువాలిటీ వార్డునీ, ఆర్థో పెడిక్‌వార్డునీ విధిగా దర్శించాలి. వివిధ యాక్సి డెంట్ల మూలంగా ప్రజలు ఏవిధంగా కష్టపడుతు న్నారో ఇతను కళ్లారా తిలకించాలి. అలా చేసినట్టు ఆ హాస్పిటల్ అధికారులచేత రికార్డుచేయిం చుకోవాలి. కోర్టు అనుమతి లేకుండా హాస్పిటల్లో రిపోర్టుచేయడం మానివేసినా, అందుకు తగు కారణం లేకపోయినా బెయిల్ కాన్సిల్ చేయ బడుతుంది!" - ఇదీ మాజిస్ట్రేట్ పెట్టిన షరతు!

"ఈ షరతు వితంగా, కొత్తగా ఉంది. రోజూ, లేక వారానికొకసారో, నెలకొకసారో ముద్దాయిని పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు చేయమనడంలో అర్థం ఉంది. కానీ, ఇలా రోజూ ఆస్పత్రుల వెంట తిరగ మనడం ..." అంటూ డిఫెన్స్‌లాయర్ అభ్యంతరం తెలుపబోతే -

"ఇది వింతషరతనీ, మునుపెన్నడూ ఏ న్యా యస్థానమూ విధించనిదనీ నేనెరుగుదును. అయి తే ఓప్రయోజనాన్ని ఆశించి, ఓ కొత్త ప్రయోగంగా ఈ షరతును విధిస్తున్నాను నేను!" అన్నారు మాజి స్ట్రేటు దృఢంగా.

ఆ కండిషన్ జుడీషియరీలో సరచలనాన్ని కలిగిస్తుందని మాజిస్ట్రేట్ మార్కండేయులు ఎరు గనిది కాదు. అయినా సాహసంతో ఆ ప్రయోగా నికి పూనుకున్నారాయన. దానివల్ల సత్ఫలితాలు కలిగితే తన ధ్యేయం నెరవేరుతుంది.

* * *


కోర్టుఆర్డరు ప్రకారం నిత్యమూ జనరల్ హాస్పిటల్‌కి వెళుతున్నాడు నరసింహులు. కాజువా లిటీవార్డులోనూ, ఆర్థోపెడిక్‌వార్డులోనూ విధిగా కొంతసమయం గడిపివస్తున్నాడు.

ఆరంభంలో అతని మనసుకంతగా పట్టలేదు. చావుబతుకుల మీదనున్న కేసులు కాజువాలిటీ వార్డుకి వస్తుంటే కుతూహలంతో చూశాడు. ఆర్థో పెడిక్ వార్డులో కాళ్లు పోగొట్టుకున్నవాళ్లు, చేతులు కోల్పోయినవాళ్లు, నడుములు విగిరినవాళ్లూ బెడ్స్ మీద, నేలమీదా పడివుంటే అదేదో సామాన్యవిష యమన్నట్టూ, సాధారణ దృశ్యమైనట్టూ చూశాడు.

అయితే, నాలుగు రోజులు గడిచేసరికి తనకు తెలీకుండానే ఏదో మార్పు ఆరంభమైయింది నరసింహులులో. ఓ రోజున యువతీయువకుల జంటను ఒకటి అత్యంత ప్రమాదస్థితిలో కాజువా లిటీకి తీసుకువచ్చారు. ఏదో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారట ఆ దంపతులు. పక్కనే మూడేళ్లపాప హృదయవిదారకంగా ఏడుస్తోంది. వారి స్కూటర్ని సిటీబస్సు గుద్దేసిందట. అక్కడికి తీసుకొచ్చిన పావుగంటకే ప్రాణాలు విడిచారు ఆ దంపతులు. తల్లి దండ్రుల మృతదేహాలమీద పడి అనాథ అయిన పాప గోడుగోడున ఏడుస్తోంది. ఆ దృశ్యం కళ్లారా చూసిన నరసింహులు హృద యం మొదటిసారిగా బాధతో మూలిగింది.

మరో రోజున డ్రైవర్ తాగి లారీ తోలడంతో సైకిల్ మీద వెళుతున్న ఓ నడివయస్కుడికి యాక్సి డెంటయితే కాజువాలిటీకి తీసుకువచ్చారు. రెండు కాళ్లూ నుగ్గునుగ్గయిపోవడంతో అప్పటికప్పుడు ఆపరేషన్ చేసి అతన్ని కాళ్ల రెండూ తొలగిం చవలసివచ్చింది. అతని పెళ్లాం, పెళ్లీడుకొచ్చిన ఇద్దరుకూతుళ్లు, చిన్నవాడయిన కొడుకు గుండె లు పగిలేలా విలపిస్తూంటే హృదయవిదారకంగా అనిపించింది నరసింహులుకి. ఆ రోజంతా మన సు కుదురులేకుండా పోయిందతనికి.

ఇంకోరోజున టూరిస్టుబస్సు గుద్దుకున్న కార ణంగా మారుతీవాన్‌లో వెళ్తున్న అయిదుగురిలో ఇద్దరు అక్కడికక్కడే మరణించడమూ, మిగతా వాళ్లు తీవ్రంగా గాయపడడమూ జరిగాయి. పెళ్లి వారిని తీసుకువెళ్తున్న ఆ వాన్ పచ్చడయి పోయిం దనీ, మరణించినవారిలో పెళ్లికొడుకు ఉన్నట్టూ,





# డాక్టర్ - డాక్టర్

డైట్ థెరపీ, మాగ్నటో థెరపీ, యోగా థెరపీ, ఆక్యుపంచర్‌లలాంటి ప్రకృతి సంబంధ వైద్య విధానాలకు సంబంధించిన సమస్యలు, సందేహాలకు ప్రముఖ ప్రకృతివైద్యనిపుణులు

**డా॥ జి.గణేష్ బి.ఎన్.వై.ఎస్., ఎం.డి. జవాబులివ్వనున్నారు.**

**మీ ప్రశ్నలు డాక్టర్-డాక్టర్, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, ఎక్స్‌ప్రెస్ సెంటర్, దోమల్ గూడ, హైదరాబాద్-29.**

గాయపడినవారిలో పెళ్లికూతురు ఉందనీ ఆలకించి, ఎవరో గుండెలుపట్టి పిండుతున్నట్టు గిలగిలలాడిపోయాడు నరసింహులు. టూరిస్ట్‌బస్ డ్రైవర్ హైస్పీడులో ఎదుటి వాహనాలను ఓవర్‌టేక్ చేయబోవడంవల్ల ఆ దుర్ఘటన సంభవించినట్లు విని, మొదటిసారిగా ఆ డ్రైవర్ మీద కసిగా పళ్లు నూరాడు.

అంతవరకూ అతని దృష్టిలోకి వచ్చిన ప్రమాదాలన్నీ డ్రైవర్ల నిర్లక్ష్యం, అహంకారాల మూలంగానే జరిగినట్లు గ్రహించాడు. తనమూలంగా విగతజీవుడైన రిక్షారాముడు గుర్తుకొచ్చేవాడు. అనాథలైన వాడి పెళ్లాం, పిల్లల్ని తలుచుకుంటే కడుపులో ఏదో బాధ బయలుదేరేది. అపెండిసైటిస్ వచ్చిన వాడిలా గిలగిలలాడిపోయేవాడు అపరాధ భావనతో.

అలాగే, అర్థోపెడిక్ వార్డులో కాళ్లూ, చేతులూ పోగొట్టుకునీ, విరగ్గొట్టుకునీ బాధపడుతున్న పేషెంట్స్‌ని చూసి జాలి కలిగేది నరసింహులికి. అందులో అధికశాతం పేదలేకావడం మరోవిశేషంగా తోచింది. వారి వారి విషాదగాథలను, కారణాలను అడిగి తెలుసుకుని, తనకు తెలీకుండానే కన్నీరు కార్చే స్థితికి వచ్చాడు. తాను చేసిన పాపాన్ని అక్కడ పదుగురికీ చెప్పుకుని పశ్చాత్తాపపడేవాడు.

అంతటితో ఆగకుండా ఆసుపత్రి అంతా తిరిగి వివిధ వార్డులలోని పేషెంట్స్ అందరినీ చూసి వస్తూండేవాడు. రకరకాల జబ్బులతో వారు పడే నరకయాతనను కళ్లారాచూసి, తానూ మానసికంగా వాటిని అనుభవించేవాడు. మనిషి పుట్టింది మొదలు గిట్టేంతవరకు ఎన్నెన్ని బాధలకు, ఎన్ని రకాల జబ్బులకు గురికాగలడో గ్రహింపుకి వచ్చిందతనికి. లోకంలో ఎంతటి కష్టము, బాధ, వ్యథ ఇమిడి వున్నాయో, ఆ సత్యం ఎరక్కుండా మనుషులు వచ్చిస్వార్థంతో ఎందుకలా ప్రవర్తిస్తారో అతని బుద్ధికి అందేది కాదు.

ఆరంభంలో ఒకటి రెండు గంటలకంటే ఎక్కువసేపు ఉండని వాడు కాస్తా క్రమేపీ తనకు తెలీ కుండానే దాదాపు రోజంతా ఆసుపత్రిలోనే గడిపేసే స్థితికి వచ్చాడు నరసింహులు. ఆ అనుభవం అతనిలో మానవత్వం పెంపొందడానికి, అహం కారం అణగారడానికి దోహదం చేస్తే, మానసికంగా అతన్ని కుంగదీసేందుకు కారణమయింది. రాను రానూ అక్కడికివచ్చే ఒక్కో కొత్తకేసూ అతని మన స్సాక్షిపైన ఒక్కో నమ్మెటపోటును పెట్టసాగింది. అలాగే మరికొద్దిరోజులు సాగినట్లయితే పిచ్చిపట్టేటట్లనిపించింది అతనికి. ఆ నిరంతర నరకయాతన కంటే ఒకేసారి ప్రాణాలు తీసే ఉరిశిక్షే నయమనిపించింది.

అందుకే నెల తిరక్కుండానే మాజిస్ట్రేట్ ఎదుట తనంతట తానుగా హాజరయ్యాడు నరసింహులు.

* * *

'అహంకారంతో కన్నుగానక ఓ పేదకుటుంబాన్ని నాశనం చేశాను. ఆ బాధ నాగుండెను ముక్కలుముక్కలుగా కోస్తోంది. ఆ దిగులు నన్ను నిలువునా కాల్చేస్తోంది. నాలాంటి దుర్మార్గుల వల్ల జనం ఎన్నిరకాలుగా బాధలుపడుతున్నారో ఆస్పత్రిలో చూస్తే తెలిసింది. ఈ గుండెకోత నేను భరించలేను. నాకు వెంటనే ఉరిశిక్ష వేసెయ్యండి సారూ! నాకు తగినశాస్తి చేయండి!" ముఖం చేతుల్లో కప్పుకుని విలపించాడు నరసింహులు.

కోర్టు హాల్లో వాతావరణం బరువెక్కింది.

భారమైన హృదయంతో గంభీరంగా అన్నారు మాజిస్ట్రేట్ మార్కండేయులు-"నీలాంటి అహంకారులు, నిర్లక్ష్యాపరులు, దుడుకుమనుషులు ఎందరో నిత్యమూ ఎన్నోవిలువైన ప్రాణాలను బలిగొంటున్నారు. కుటుంబాలను కాలరాస్తున్నారు. కొందరు శిక్షననుభవిస్తున్నారు. మరి కొందరు తెలివిగా తప్పించుకుంటున్నారు. వారి దుష్కృతాల ఫలితమేమిటో ఆస్పత్రులకు వెళ్లి చూస్తే తెలుస్తుంది. ఆస్పత్రులలో బాధ, కష్టమూ కళ్లముందు తాండవమాడుతుంటే - వాటిలో ఎన్నిటికో సాటి మనిషే కారణమన్న నగ్నసత్యం వీపుమీద కమ్చీకోలతో ఛెళ్లునకొడుతుంటే, ఆ బాధామయ దృశ్యాలను చూసి, ఆ దయనీయ గాథలను ఆలకించి నీలాంటి కొందరైనా మారగలిగితే నా తీర్పుకు సార్థకత చేకూరుతుందన్న ఆశతో - చట్టపరం కాకపోయినా, ఆచార విరుద్ధమనిపించినా సాహసించాను. ఆ వింతషరతును విధించాను! ఇప్పుడు నీలో వచ్చిన మార్పు నా ఆత్మవిశ్వాసాన్ని, మానవత పట్ల నమ్మకాన్ని పటిష్టం చేసింది. ఈ క్షణంలో నిన్ను విడుదల చేసినా సమాజానికి హానికరంగా ప్రవర్తించాలన్నా ప్రవర్తించలేవు. కానీ మన శిక్షాస్మృతిననుసరించి నీ అపరాధానికి తగినశిక్ష విధించాలి కనుక నీ కేసు విచారణ విధిగా సాగుతుంది. అయితే నీలో వచ్చిన మార్పు శిక్షానిర్ణయంలో తప్పక నీకు ఉపకరిస్తుంది."

అంతా ఆశ్చర్యంతో నోళ్లు వెళ్లబెట్టి, చెవులు రిక్కించుకుని వింటూంటే, మళ్లీ ఇలా అన్నారు మాజిస్ట్రేట్ -

"మానవుడు నేరాలు చేయడానికి నూరు కారణాలు ఉండొచ్చు. అయితే ప్రతిమనిషీ తరచు ఆసుపత్రులను దర్శించి అక్కడ మానవుడు అనుభవించే రోగాలను, బాధలను కళ్లతో చూసి, మానసికంగా అనుభవించినట్టయితే లోకంలో ఎంతటి సఫరింగ్ ఉందో, మానవాళితో విధి ఎంత క్రూరంగా ఆడుకోగలదో తెలిసివస్తుంది. అందువల్ల మనిషిలో నేరప్రవృత్తి తరిగి, మానవత్వం పెరుగుతుందన్నది నా దృఢ విశ్వాసం, ప్రగాఢ వాంఛ! కేవలం రోగులను, రోగాలను చూడ డానికే మనుషులు పీరియాడికల్‌గా ఆసుపత్రులను సందర్శించే అలవాటు ఉన్నట్టయితే మానవత్వపు విలువలు పెరుగుతాయనీ, రోడ్డు ప్రమాదాల రేటు తగ్గుముఖం పడుతుందనీ నేను ఖచ్చితంగా చెప్పగలను. ముఖ్యంగా ప్రభుత్వానికి నేనిచ్చే సలహా ఒక్కటే! డ్రైవర్స్‌కి ఇచ్చే శిక్షణలో ఒక భాగంగా కొద్దిరోజులపాటు వారిని ఆసుపత్రులనుచూసేటట్టు చేస్తే ఎంతగానో ఉపకరిస్తుంది!"

బరువైన స్వరంతో ఆ మాటలని, భారమైన హృదయంతో కోర్టును అప్పటికి వాయిదా వేశారు మాజిస్ట్రేట్ మార్కండేయ.